క్లుప్తంగా

డబ్ల్యూహెచ్‌ఓ పరిశీలకుడి తనిఖీ

చండ్రుగొండ: మండలంలోని మద్దుకూరు గ్రామంలోని ఆరోగ్య ఉపకేంద్రాన్ని డబ్ల్యూహెచ్‌ఓ పరిశీలకుడు విజయేందర్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలోని ఇమ్యూనైజేషన్ రికార్డులను పరిశీలించారు. గ్రామంలోని ఇంటింటికి వెళ్లి ఆరోగ్యశాఖ పనితీరును అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు.

సంస్కృతిని కాపాడుకోవాలి

ములకలపల్లి: ప్రకృతితో అనుసంధానమైన ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని ఎస్సై సాయికిషోర్ రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక గుడ్‌షపర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో పాల్గొన్న ఎస్సై మాట్లాడారు. పాశ్చాత్య నాగరికత మారుమూల గ్రామాలకు సైతం విస్తరించి, ఆడవిబిడ్డల నాగరికత నానాటికీ అంతరించిపోతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాలానుగుణంగా వచ్చే మార్పులను గమనించాలని, అయితే వాటిలోని మంచిని మాత్రమే గ్రహించాలని సూచించారు. ఆదివాసీ జేఏసీ నాయకులు మడకం చిరుమప్ప, గుడ్‌షపర్డ్ సిస్టర్ అనీ, గుడ్‌షపర్డ్ కాన్వెంట్ ప్రిన్సిపాల్ శశి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల గుండెచప్పుడు గద్దర్

మణుగూరురూరల్: ప్రజా సమస్యలపై నిరంతరం ఉద్యమాలను చేపట్టిన ప్రజా గాయకుడు, ప్రజా యుద్ధనౌక గద్దర్ ప్రజల గుండెచప్పుడు అయ్యారని ఇఫ్టూ ఏరియా అధ్యక్షుడు మంగీలాల్ అన్నారు. శనివారం ఇఫ్టూ అనుబంధ రైల్వే గ్యారేజ్ సైనికుల ఆధ్వర్యంలో గద్దర్ సంతాపం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళ్లు అర్పించారు. అనంతరం మంగీలాల్ మాట్లాడారు. కార్యక్రమంలో వి.శంకర్ నాయక్, కె.వెంకటనారాయణ, కె.గురుమూర్తి, శివరామకృష్ణ, జి.నాగేశ్వరరావు, టి.రామకృష్ణ, జి.సాయికుమార్, గోపి పాల్గొన్నారు.

పంచాయతీగా మార్చాలి

దమ్మపేట: మండల పరిధిలోని చిన్నగొల్లగూడెం గ్రామాన్ని ప్రత్యేక గ్రామ పంచాయతీగా మార్చాలని కోరుతూ, స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుకు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. శనివారం మండలంలోని తాటిసుబ్బన్నగూడెం గ్రామంలో ఎమ్మెల్యే మెచ్చాను, చిన్నగొల్లగూడెం గ్రామస్తులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. తమ గ్రామాన్ని ప్రత్యేక గ్రామ పంచాయతీగా మార్చడం వల్ల మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున్న యువత, మహిళలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

అశ్వారావుపేట: మండల పరిధిలోని నారాయణపురం పంచాయతీలో అభివృద్ధి పనుల కోసం సర్పంచ్ కంగాల పరమేష్, జెడ్పీటీసీ సభ్యురాలు చిన్నంశెట్టి వరలక్ష్మి ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరావుకు వినతిపత్రం అందజేశారు. శనివారం దమ్మపేట మండలం తాటిసుబ్బన్నగూడెంలోని ఆయన నివాసంలో ఎమ్మెల్యేను కలిశారు. నారాయణపురం పంచాయతీ సీసీ రహదారులు, కొత్త సూర్యాపేట గ్రామానికి విద్యుత్‌లైన్ ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు.

సన్మానం..

దమ్మపేట: అశ్వారావుపేట నియోజకవర్గంలో కేంద్రంలో ఇటీవలే డిగ్రీ కళాశాల, 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రిని మంజూరు చేయించిన ఎమ్మెల్యే మెచ్చాను రాష్ట్ర ఆదివాసీ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. శనివారం ఎమ్మెల్యేను తాటిసుబ్బన్నగూడెంలో మర్యాదపూర్వకంగా కలసిన ఆదివాసీ నాయకులు.. ఆయనను శాలువాతో సన్మానించారు. సంఘం రాష్ట్ర నాయకులు తెల్లం రామారావు, కొర్సా వెంకటేష్, కొండ్రు సుధాకర్, చిన్నరాజు పాల్గొన్నారు.

పాలాభిషేకం

భద్రాచలంటౌన్: భద్రాచలం డివిజన్‌లో పలు అభివృద్ధి పనుల కోసం రూ.15 కోట్లు మంజూరు చేసిన సందర్భంగా బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం అంబేడ్కర్ సెంటర్‌లో తెలంగాణ సీఎం కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. మండల అధ్యక్షుడు అరికెళ్ల తిరుపతిరావు నర్రా రాము, బలరామ్, నగేష్, రామకృష్ణ, పుల్లారావు, వెంకటేశ్వరరావు, రవికుమార్ పాల్గొన్నారు.

కళాకారుల వినతి

మణుగూరురూరల్: సింగరేణి కళాకారుల సమస్యలను పరిష్కరించాలని, కళలను పోత్సహించాలని కోరుతూ సింగరేణి కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సింగరేణి డైరెక్టర్(పా) ఎస్.బలరాంకు ఐక్యవేదిక నాయకులు, కళాకారులు శనివారం వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన డైరెక్టర్(పా) సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపినట్లు కళాకారుల ఐక్యవేదిక సెంట్రల్ కమిటీ ప్రచార కార్యదర్శి పవన్ కుమార్ తెలిపారు. సింగరేణి కళాకారుల ఐక్యవేదిక సెంట్రల్ కమిటీ ప్రచార కార్యదర్శి పులియాల సతీష్, గౌరవ అధ్యక్షుడు సాధనవేని ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి సానా జలపతి, మణుగూరు ఏరియా అధ్యక్షుడు సురేందర్, ఉపాధ్యక్షుడు నర్సయ్య, కల్చరల్ కెప్టెన్ డేవిడ్ రాజ్, ఎగ్గేటి రాజేశ్వరరావు, కళాకారులు పాల్గొన్నారు.

అటు వెలుగులు.. ఇటు విషం

- గోదావరిలో కలుస్తున్న బీటీపీఎస్ బూడిద వ్యర్థాలు
- కలుషితమవుతున్న తాగునీరు
- బోరుబావుల్లోనూ బూడిద ఆనవాళ్లు..
- ఇప్పటికే పొగతో ఉక్కిరిబిక్కిరి



కొండాయిగూడెం వద్ద బూడిద నీరు చేరడంతో కలుషితమైన గోదావరి జలాలు



దమ్మక్కపేట పక్కన తోగు నుంచి ప్రవహిస్తున్న బూడిద నీరు

పినపాక: పినపాక, మణుగూరు, ఏటూరునాగారం ప్రధాన రహదారి చిక్కుడుగుంట వద్ద నిర్మించిన భద్రాద్రి విద్యుత్ ప్లాంట్ ఓ పక్క రాష్ట్రానికి వెలుగులు అందిస్తూనే.. మరోపక్క ప్లాంట్ వ్యర్థాలతో సమీప ప్రజలను అనారోగ్యం పాలు చేస్తోంది. నాలుగు యూనిట్లు 270 వంతున 1080 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా ప్రారంభించిన భద్రాద్రి విద్యుత్ థర్మల్ ప్లాంట్.. బాలరిష్టాలను అధిగమించి ఇటీవలే పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించింది. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు వినియోగించే బొగ్గు వ్యర్థాలు బూడిద రూపంలో సమీప గ్రామమైన దమ్మక్కపేట తోగు ద్వారా గోదావరి నదిలో కలుస్తున్నాయి. దీంతో స్వచ్ఛంగా ఉండాల్సిన గోదావరి కలుషితమై ఆ నీరు తాగిన వారు అనారోగ్య బారిన పడుతున్నారు. మణుగూరు, పినపాక, కరకగూడెం మండలాలకు తాగునీరు సరఫరా గోదావరి నుంచే జరుగుతుంది.

ఆది నుంచి వివాదాలే..

ప్లాంట్ ప్రారంభం నుంచి వివాదాలకు రాజుకుంటూనే ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న టెక్నాలజీకి అనుగుణంగా ఇక్కడ సూపర్ క్రిటికల్ తరహాలో ప్లాంట్ నిర్మాణం చేపట్టాల్సి ఉండగా అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం చేసి సబ్ క్రిటికల్ టెక్నాలజీని వినియోగించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అనంతరం హరిత ట్రిబ్యునల్ సైతం అభ్యంతరాలు వెల్లిబుచ్చడంతో కొంతకాలం పాటు నిర్మాణ పనులు నిలిపివేశారు. తిరిగి పనులు ప్రారంభమై ఉత్పత్తి జరుగుతున్న నేపథ్యంలో వ్యర్థాలపై చర్యలు తీసుకోవాల్సిన జెన్కో అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

భూగర్భ జలాలూ కలుషితం

గోదావరి నదిలో వ్యర్థాలు కలవడం ద్వారా అవస్థలు పడుతున్న ప్రజలకు తోగు నుంచి ప్రవహిస్తున్న బూడిదనీరు జలాలు సమీప ప్రాంతాల బోరు బావుల్లోకి ఇంకుతున్నాయని వాపోతున్నారు. గతంలో స్వచ్ఛంగా ఉండే నీరు ప్రస్తుతం దుర్వాసన వస్తుందని వాపోతున్నారు. అధికారులకు సమస్యలను వివరించినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గాలి ద్వారా వ్యాపించే పొగతోనే అవస్థలు పడుతుంటే ప్రస్తుత సమస్య తీవ్ర మనోవేదనకు గురిచేస్తోంది.

వెంటాడిస్తున్న అనారోగ్యం

బూడిదతో కాలుషితమైన నీరు తాగడం వల్ల ప్రజలు దగ్గు, జలుబు, జ్వరం వంటి హాలో అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్యులు అభిప్రాయపడుతున్నారు. కలుషితమైన గాలితో ఊపిరితిత్తుల సమస్య, చిన్నపిల్లలకు శ్వాస సంబంధిత వ్యాధులు తలెత్తుతాయని వైద్యులు చెబుతున్నారు.

అనారోగ్యం పాలవుతున్నాం..



భద్రాద్రి పవర్ ప్లాంట్ నుంచి వస్తున్న పొగతో ఇబ్బంది పడుతుంటే, బూడిద చెరువు నుంచి కలుషితమైన నీరు దమ్మక్కపేట తోగు నుంచి వెళ్లి గోదావరిలో కలవడం, ఆ నీరు తాగడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు.

– జయరాజ్, దమక్కపేట

కలుషిత నీటితో అవస్థలు



కలుషిత నీటితో దమ్మక్కపేట గ్రామస్తులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. జీవితాల్లో బీటీపీఎస్ వెలుగులు విరజిల్లుతాయని అనుకుంటే బూడెదను విస్తరింపజేస్తోంది. బూడిద నీరు గోదావరిలో కలుస్తూ దమ్మక్కపేట రైతులకు గ్రామస్తులకు తీవ్ర కన్నీళ్లు మిగిలుస్తోంది. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

– రాంబాబు, సర్పంచ్, దమ్మక్కపేట

అడవిదాటి వైద్య సేవలు..



అశ్వారావుపేట: వాగు దాటుతున్న వైద్యసిబ్బంది

అశ్వారావుపేట: మండల పరిధిలోని వినాయకపురం(అశ్వారావుపేట) పీహెచ్‌సీ వైద్యశిబ్బంది శనివారం ఓ మారుమూల గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించేందుకు సుమారు 4 కిలోమీటర్లు దట్టమైన అడవి, రెండు వాగులు దాటారు. గుట్టలెక్కి ప్రయాణం చేశారు. మండల పరిధిలోని మారుమూల గ్రామమైన మొద్దుల మడ నుంచి 7కిలోమీటర్లు అవతల గుట్టలపై గొత్తికోయలుండే పెద్ద మిద్దిలో వైద్యశిబిరం నిర్వహించారు. 41మందిని పరీక్షించి ఒకరికి మలేరియా లేకుండా జ్వరం ఉన్నట్లు గుర్తించారు. దోమల నివారణకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. డాక్టర్ రాందాస్, సబ్‌యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, హెచ్‌ఈఓ రాజు, శ్రీనివాస్, సత్యనారాయణ, చెల్లమ్మ, శ్యామల, సత్యవతి, ప్రతాప్‌రెడ్డి, ఏసురెడ్డి పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లిలో వైద్య శిబిరం

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో ఎర్రగుంట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో అనుమానిత జ్వర కేసులు ఉండడంతో అన్ని దోమల నివారణకు ఇళ్లలో పైరత్రమ్ స్ప్రే చేయించారు. ప్రజలకు ఆరోగ్యంపై డాక్టర్ ప్రియాంక అవగాహన కల్పించారు. కార్యక్రమాలలో హెచ్‌ఈఓ కృష్ణయ్య, హెచ్ఎస్ నాగేశ్వరరావు, రాందాసు, సోనియా, కోటేశ్వరరావు, ఆశాలు నజీమా, లక్ష్మి, విజయ, చందవత్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాలికల ఆశ్రమ పాఠశాలలో..

మణుగూరురూరల్: మణుగూరులోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ విద్యార్థినులకు వైద్యపరీక్షలు చేసి నివారణ మందులను పంపిణీ చేశారు. కళ్ల కలకల సమస్యతో బాధపడుతున్న వారికి ఐడ్రాప్స్, యాంటి బయోటిక్స్ వేశారు. ఆయన మాట్లాడారు. సీహెచ్‌ఓ వెంకటేశ్వరరావు, సూపర్‌వైజర్ జానకి, వైద్యసిబ్బంది రాంప్రసాద్, శ్రీకాంత్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

జ్వర సర్వే పరిశీలన

అన్నపురెడ్డిపల్లి: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల వైద్యాధికారిణి డాక్టర్ ప్రియాంక సూచించారు. మండల పరిధిలోని అన్నపురెడ్డిపల్లి, ఎర్రగుంటలో శనివారం వైద్య సిబ్బంది నిర్వహించిన రాపిడ్ ఫీవర్ సర్వేను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఇళ్ల చుట్టూ నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు గ్రామాల్లో ప్రజలకు పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. జ్వరం, జలుబు, దగ్గు, చిన్నచిన్న రుగ్మతలు ఉన్న వారికి పీహెచ్‌సీలో రక్త పరీక్షలు చేస్తారని తెలిపారు.

లైసెన్స్‌కు వేలం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని బస్టాండ్ ఇన్ గేట్ పక్కన ఉన్న కనకదుర్గ అమ్మవారి ఆలయంలో భక్తులు అమ్మవారికి సమర్పించే చీరెల సేకరణ లైసెన్స్ కోసం ఈ నెల 14 బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వేలంలో లైసెన్స్ హక్కు దక్కించుకున్న వారు ఏడు నెల పాటు ప్రతి రోజూ అమ్మవారికి భక్తులు సమర్పించే 10 చీరెలు, 20 జాకెట్ ముక్కలు సేకరించవలేనని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు రూ.25 వేలు ఆలయ ఖాతాలో జమచేసి వేలంలో పాల్గొనవల్సిందిగా పేర్కొన్నారు.

రేపు కంటి వైద్య శిబిరం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని పాత ఎల్ఐసీ ఆఫీస్ రోడ్డులోని ఆల్ పెన్షనర్స్ డివిజన్ కార్యాలయంలో ఈ నెల 14న ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు బందు వెంకటేశ్వర్లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో వరంగల్ శరత్ మాక్స్ విజన్ ఆస్పత్రి వైద్యులు ఉచితంగా పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి అపరేషన్ నిర్వహిస్తారని తెలిపారు. ఈ శిబిరంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, హెల్త్ కార్డు కలిగిన వారు పరీక్షలు చేయించుకోవచ్చని తెలిపారు.

సీపీఎం నాయకుడి మృతిపై సంతాపం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఎస్ఎఫ్ఐ విద్యార్థి ఉద్యమం ద్వారా పోరాటాలను ప్రారంభించి అనేక ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించిన సీపీఎం మాజీ రాష్ట్ర కమిటీ సభ్యుడు, నవ తెలంగాణ దినపత్రిక మాజీ చీఫ్ జనరల్ మేనేజర్ పివి.శ్రీనివాస్ గుండెపోటుతో ఆకస్మికంగా మరణించడంపై సీఐటీయూ జిల్లా కమిటీ తీవ్ర సంతాపాన్ని ప్రకటించింది. ఆయన మృతి కమ్యూనిస్టు, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.బ్రహ్మాచారి, ఏజె.రమేష్‌లు అన్నారు. శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు సీఐటీయూ జిల్లా కమిటీ ప్రగాఢ సానుభూతిని తెలిపింది.

ఉద్యోగ సంఘం నాయకుడి మృతికి..

అశ్వాపురం: అనారోగ్యంతో మృతి చెందిన మణుగూరు భారజల కర్మాగారం ఉద్యోగ సంఘం నాయకుడు, టీఎస్‌టీయూసీ సీనియర్ నాయకుడు బీకే.దుర్గారావు మృతదేహానికి శనివారం గౌతమీనగర్ కాలనీలోని ఆయన నివాసంలో భారజల కర్మాగారం అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీల నాయకులు నివాళులర్పించారు. భారజల కర్మాగారం జీఎం కేవీ.థాలే, అధికారులు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, ఎంపీపీ ముత్తినేని సుజాతతోపాటు ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు, పార్టీల సారథులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

ఏరియా ఉత్తమ ఉద్యోగులు వీరే..



మణుగూరు ఏరియా ఉత్తమ ఉద్యోగులు..

మణుగూరురూరల్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా ఉత్తమ ఉద్యోగులను ఎంపిక చేసినట్లు ఏరియా అధికార ప్రతినిధి ఎస్.రమేష్ తెలిపారు. శనివారం ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.. కార్పొరేట్ ఉత్తమ ఉద్యోగిగా మణుగూరు ఓసీలో ఈపీ ఎలక్ట్రిషియన్ గోరంట్ల మోహన్‌బాబు ఎంపికయ్యారు. ఏరియా ఉత్తమ ఉద్యోగులుగా కునుసోత్ బాబులాల్ (ఈపీ ఆపరేటర్, పీకేఓసీ–2), కె.వెంకటరమణరావు (ఈపీ ఆపరేటర్, పీకేఓసీ–2, ఎస్ఆర్‌వీ సిల్వరాజు (ట్రిప్ మ్యాన్/డ్రంప్ మ్యాన్, ఓసీ–4), బొద్దుకల్ల సుధాకర్ (ఈపీ ఆపరేటర్, మణుగూరు ఓసీ), కంది శంకర్ (హెడ్ చైన్‌మెన్, మణుగూరు ఓసీ), వేముల భాస్కర్‌రావు (హెడ్ చైన్‌మెన్, కేపీయూజీ), గంపల డేవిడ్ (వేగన్ లోడ్ అండ్ శంట్ మజ్దూర్, కేసీహెచ్‌పీ), సముద్రాల సత్యనారాయణ(ఎలక్ట్రిషియన్, ఏరియా వర్క్‌షాప్), బండ రాజేష్ (సెక్యూరిటి గార్డ్, ఎస్అండ్‌పీసీ)లు ఎంపికయ్యారు. ఏరియా ఉత్తమ ఉద్యోగులను పీవీకాలనీ కమ్యూనిటిహాల్ ప్రాంగణంలో జరిగే వేడుకల్లో ఏరియా జీఎం దుర్గం రామచందర్ చేతుల మీదుగా, ఉత్తమ ఎస్‌సీడబ్ల్యూఏ ఉద్యోగి మోహన్‌బాబును కొత్తగూడెం హెడ్డాఫీస్‌లో జరిగే వేడుకల్లో సీఅండ్ఎండీ శ్రీధర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేసి సన్మానించడం జరుగుతుందన్నారు.

వైద్యసేవలపై ఎమ్మెల్యే ఆరా



ఆర్ఎంవో డాక్టర్ రాజశేఖర్ రెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పొదెం వీరయ్య

భద్రాచలంఅర్బన్: భద్రాచలం శాసన సభ్యుడు పొదెం వీరయ్య శనివారం భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని ఆకస్మికంగా సందర్శించారు. గోదావరి వరదల అనంతరం నియోజకవర్గంలో డెంగీ, మలేరియా వంటి వ్యాధులు విస్తృతంగా వ్యాప్తి చెందడం కారణంగా నియోజకవర్గ ప్రజలు అనేక మంది జ్వరాల బారినపడి ప్రైవేట్, ప్రభుత్వ ఆస్పత్రులలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో జ్వర బాధితులకు, ఇతర పేషెంట్లకు అందుతున్న వైద్యంపై ఎమ్మెల్యే పొదెం ఏరియా ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ రామకృష్ణను అడిగి తెలుసుకున్నారు. ప్రతి వార్డును ఆయన సందర్శించి రోగులకు అందుతున్న వైద్యంపై ఆరా తీశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఏరియా ఆస్పత్రిలో ప్రస్తుతం 16 మంది వైద్యులు మాత్రమే పనిచేస్తుండటం ఎంతో దౌర్భాగ్యం అని అన్నారు. ఇక్కడ ఉన్న వైద్యులను వేరే ప్రాంతాలకు డిప్యూటేషన్లపై పంపించి, ఈ ప్రాంతంలో నివసించే ఆదివాసీ గిరిజనుల ఆరోగ్యంతో ప్రభుత్వం ఆడుకుంటోందని విమర్శించారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడి డాక్టర్ల డిప్యుటేషన్లు రద్దు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించి కమిషనర్.. సోమవారం రివ్యూ చేసి పంపిస్తామని తెలిపారు. ఆయన వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ, ఆర్ఎంవో డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, ఇతర వైద్య సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.

పోస్టల్ సిబ్బంది ప్రదర్శన

దుమ్ముగూడెం: కేంద్రప్రభుత్వ ఆదేశాల మేరకు హర్ ఘర్‌కో తిరంగ కార్యక్రమంలో భాగంగా శనివారం దుమ్ముగూడెం పోస్టల్ సిబ్బంది ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనను జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో తపాలాశాఖ చేస్తున్న సేవలు ప్రజల మన్ననలు పొందుతున్నాయన్నారు. కార్యక్రమంలో సీఐ దోమల రమేష్, ఎస్సై కేశవరావు, ఏఎస్పీయం జానకిరాములు, గోపాల్‌రావు, వీరరాఘవరెడ్డి, విద్యాసాగర్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భౌతిక దాడిపై కేసు నమోదు

దమ్మపేట: వివాహితపై భౌతిక దాడికి పాల్పడిన వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని మొండివర్రె గ్రామానికి చెందిన పద్దం మేరీ అనే మహిళ.. ఈ నెల 6వ తేదీన పుట్టింటి నుంచి భర్త ఇంటికి వచ్చింది. ఈ క్రమంలో ఆమె భర్త పద్దం లక్ష్మణరావుతో పాటుగా మరో ఐదుగురు ఇంటికి ఎందుకు వచ్చావంటూ.. ఆమెను అసభ్య పదజాలంతో దూషించారు. చేతులతో భౌతిక దాడికి పాల్పడ్డారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దార్యప్తు చేస్తున్నామని ఎస్సై రవికుమార్ తెలిపారు.

మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌ను కలిసిన రోశిరెడ్డి



సునీతాలక్ష్మారెడ్డిని శాలువాతో సత్కరిస్తున్న రోశిరెడ్డి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యుడు యడమకంటి రోశిరెడ్డి శనివారం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి, భద్రాచలం దేవస్థానం ప్రసాదం, సీతారాముల ఫొటోను అందజేశారు. ఏజెన్సీ ప్రాంతం అయిన భద్రాచలంలో పర్యటించిన మహిళా చట్టాలపై అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమెను కోరారు.

భర్త దాడి చేశాడని ఫిర్యాదు

ములకలపల్లి: వివాహితపై ఆమె భర్త చేసిన దాడిలో చేయి విరగగా పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాజుపేటకు చెందిన బండారు కొండయ్యకు ఇరవై ఏళ్ల క్రితం రమణతో వివాహం జరగగా వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. అయితే, కొండయ్య మరో స్త్రీతో వివాహేతర సంబంధం పెట్టుకుని భార్యను వేధిస్తున్నాడు. గురువారం కొండయ్య అకారణంగా రమణపై దాడి చేశాడు. ఆమె కుడి చేయి విరగగా శనివారం ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.

వేంకటేశ్వర స్వామి కల్యాణం

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత బాలాజీ వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని అర్చకుడు ప్రసాదాచార్యులు శనివారం వైభవంగా జరిపించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

గుండెపోటుతో మృతి

అశ్వాపురం: దమ్మపేట ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న ఇసంపల్లి కొండయ్య(42) శనివారం గుండె పోటుతో మృతి చెందాడు. మండల కేంద్రంలో గౌతమీనగర్ కాలనీ ఎదుట అద్దెకు ఉంటున్న కొండయ్య సాయంత్రం గుండె పోటు రాగా కుటుంబసభ్యులు అశ్వాపురం పీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు.

దమ్మపేట: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు ఈసంపల్లి కొండయ్య (42) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. కొండయ్య జిల్లా కేంద్రం కొత్తగూడెంలో ఉపాధ్యాయులు చేస్తున్న ధర్నాకు శనివారం హాజరయ్యారు. ఈ క్రమంలో అతడికి గుండెనొప్పి రావడంతో ధర్నా నుంచి వెంటనే కొత్తగూడెంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కొండయ్య గుండెపోటుతో మృతి చెందారు.

సెకండ్ ఏఎన్ఎంల వంటావార్పు



దుమ్ముగూడెం: వంటావార్పు కార్యక్రమంలో నినాదాలు చేస్తున్న సెకండ్ ఏఎన్ఎంలు

ఎస్ఆర్‌హెచ్ఎంలో సెంకండ్ ఏఎన్ఎంలుగా విధులు నిర్వహిస్తున్న వారిని రెగ్యులర్ చేయాలని సీపీఐ అనుబంధ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం నిరసన వ్యక్తం చేశారు. పలు ప్రాంతాల్లో వంటావార్పు చేసి నిరసన తెలిపారు. సమ్మె నోటీస్ ఇచ్చినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడంతో ఆగస్టు 16 నుంచి సమ్మెబాట పట్టనున్నట్లు నాయకులు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం జూలై 26న జారీ చేసిన మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ నోటిఫికేషన్ 2/2023ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



చండ్రుగొండ: వంటావార్పు చేస్తూ నిరసన తెలుపుతున్న సెకండ్ ఏఎన్ఎంలు



అశ్వారావుపేటలో..

ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ వేడుకలు

దమ్మపేట: అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం మండల కేంద్రంలో నిర్వహించారు. దమ్మపేటలో జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి యువత, విద్యార్థులకు మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ.. సోషలిజం లక్ష్యంతో నిరంతరం విద్యార్థుల హక్కుల కోసం పోరాడిన ఘనత ఒక్క ఏఐఎస్ఎఫ్‌కే దక్కుతుందని అన్నారు. కార్యక్రమంలో శివకృష్ణ, పాకనాటి నాగేంద్ర, నామాల చందు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో ఏఐఎస్ఎఫ్ 88వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకుడు ఆరోజు సునీల్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ఏఐఎస్ఎఫ్ అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా విద్యారంగ సమస్యల పట్ల అంకితభావంతో ఆవిర్భావం నుంచి నేటి వరకు పోరాటాలు నిర్వహించే ఏకైక సంఘం ఏఐఎస్ఎఫ్ మాత్రమేనని అన్నారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా సంఘం రాజీలేని పోరాటం చేసిందని తెలిపారు. సమస్యలపై భవిష్యత్ ఉద్యమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు బల్లా సాయి కుమార్, సాధనపల్లి సతీష్, లక్షణ్, జిల్లా సహాయ కార్యదర్శి మారెడ్డి గణేష్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు నానిపల్లి ప్రమోద్, బేతం ఇంద్రకీలాద్రి, గుంజా గోపి, యువజన సమాఖ్య పట్టణ కార్యదర్శి శివ పాల్గొన్నారు.